# BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU


# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ 29-03-2025

WWW.EPAPER.MAHAADAILY.COM


ANN తెలుగు


## సుక్మా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్
## 20 మంది మావోయిస్టులు మృతి




**కొత్తగూడెం, మహా:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి తుపాకుల మోత మోగింది పచ్చటి ప్రకృతి వనంలో నెత్తుటేర్లు పారాయి. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం జరిగిన భీకర పోరులో 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా జిల్లా గోగుండ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సీఆర్పీఎఫ్, డీఆర్జీ భద్రతా దళాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో వారికి తారాసపడిన మావోయిస్టులు.. జవాన్లపై కాల్పులు జరిపారు. అప్పటికే ఆ ప్రాంతంలో భారీగా మోహరించిన భద్రతా దళాలు నలుదిక్కులా చుట్టూముట్టి ఎదురుకాల్పులను ప్రారంభించాయి. ఇరు వర్గాల మధ్య విడతలవారీగా ఉదయం నుంచి కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. మృతుల్లో డీవీసీఎం జగదీశ్ కూడా ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సుమారు 20 మృతదేహాలను స్వాదీనం చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తున్నది. భద్రతా బలగాల కాల్పుల్లో మరికొందరు మావోయిస్టులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

## భర్తకు కాఫీలో విషం కలిపి ఇచ్చిన భార్య




**మహా :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫరూఖాబాద్‌లో దారుణం చోటు చేసుకుంది. భర్తకు కాఫీలో విషం కలిపి అతని భార్య హత్య చేయాలని ప్రయత్నించిందని భర్త కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఫరూఖాబాద్‌కు చెందిన అనూజ్ (30), పింకీ(28)లకు రెండు నెలల క్రితం వివాహం అయింది. వివాహం జరిగిన రెండు నెలలకే వీరిద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో పింకీ పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి.. తిరిగి భర్త వద్దకు పంపించారు. అయితే మీరట్‌లోని ఓ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పని చేస్తున్న అనూజ్ గత మంగళవారం ఇంటికి వచ్చి భార్యను కాఫీ ఇమ్మని అడిగాడు. కాఫీ తాగిన వెంటనే అతనికి వాంతులు అయ్యాయి. దీంతో అతనికి ప్రాథమిక చికిత్స అందించి ఆ తర్వాత మీరట్‌లోని ఆస్పత్రికి తరలించారు. కానీ, భార్య పింకీ మాత్రం భర్తతో ఆస్పత్రికి రాకుండా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అనూజ్ కుటుంబ సభ్యులు పింకీనే కాఫీలో విషం కలిపిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె తరచూ ఓ అబ్బాయితో ఫోన్‌లో మాట్లాడటం వల్లే వీరిద్దరి మధ్య గొడవలు జరిగేవి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనూజ్ స్పృహలోకి వచ్చాక అతన్ని కూడా విచారిస్తామని.. రామ్‌శీష్ యాదవ్ తెలిపారు.

## ఎంగేజ్‌మెంట్ చేసుకున్న త్రిష!



**మహా:** సినిమా ఇండస్ట్రీలో త్రిషది సుదీర్ఘ ప్రస్థానం అని చెప్పుకోవచ్చు. గత 20 ఏళ్లుగా ఆమె హీరోయిన్ గా సినిమాలు చేస్తూనే ఉంది. 40 ఏళ్ల వయసు దాటినా ఇప్పటికీ అదే అందం, అభినయంతో ఆడియెన్స్ ను అలరిస్తూనే ఉంది. ఈ అందాన్ని చూసి టీనేజ్ అమ్మాయిలు, కుర్ర హీరోయిన్లు సైతం కుళ్లుకుంటారంటే అతి శయోక్తి కాదు. సినిమాలు తప్పితే ఇతర విషయాల గురించి పెద్దగా పట్టించుకోని త్రిష గురించి అప్పుడప్పుడు కొన్ని రూమర్లు వినిపిస్తుంటాయి. ముఖ్యంగా ఈ ముద్దుగుమ్మ పెళ్లి విషయంలో తరచూ ఏదో ఒక వార్త వినిపిస్తూనే ఉంటుంది. అయితే అవన్నీ రూమర్లు గానే మిగిలిపోయాయి. ఇప్పుడు మరోసారి త్రిష పెళ్లి వార్తలు తెరమీదకు వచ్చాయి. దీనికి కారణం సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన ఫొటోలే. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే త్రిష తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ట్రెడిషినల్ ఫొటో షేర్ చేసింది. అందులో ఆమె ఆకుపచ్చ రంగు చీరలో ఎంతో అందంగా కనిపించింది. ఇక శారీ కలర్ కు మ్యాచింగ్ గా మెడలో నెక్లెస్, చేతికి ఉంగరం ధరించి అచ్చం అతిలోక సుందరిలా కనిపించింది. ఈ ఫొటోలకు 'ప్రేమ ఎల్లప్పుడూ గెలుస్తుంది' అని క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది. త్రిష షేర్ చేసిన ఈ పోస్ట్, ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి.

## పండుగవేళ తుపాకీ కాల్పులతో
# ఉలిక్కిపడ్డ పాతబస్తీ



**మహా :** హైదరాబాద్‌లో శనివారం(మార్చి 29) ఉదయం కాల్పులు కలకలం సృష్టించాయి. గుడిమల్కాపూర్ పరిధిలోని కింగ్స్ ప్యాలెస్‌లోని ఆనం మీర్జా ఎక్స్‌పోలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆనం మీర్జా ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో వివిధ రకాల వ్యాపారులు భారీగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇద్దరు దుకాణాదారుల మధ్య చిన్నపాటి గొడవ కాల్పుల దాకా వెళ్లింది. ఘర్షణ తారాస్థాయికి చేరడంతో ఒక షాప్ కీపర్ గాలిలో కాల్పులు జరిపాడు. ఈ ఘటన జరగడంతో ఎక్స్‌పో చూడటానికి వచ్చిన సందర్శకులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. కాల్పులు జరగడంతో ఆ ప్రాంతంలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం(మార్చి 29) ఉదయం 8 గంటల ప్రాంతంలో కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ సందర్భంగా స్టాల్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రోజున ఉదయం టాయ్స్ స్టాల్ ఫారుక్ అహ్మద్ అతని సోదరుడు సయ్యద్ హారున్ బొమ్మల షాపు నిర్వహిస్తున్నారు. వీరి పక్కనే దుబాయ్‌కు చెందిన తౌఫిక్ పెర్ఫ్యూమ్ షాప్ నిర్వహిస్తున్నాడు. అయితే ఒక పెర్ఫ్యూమ్ ఉచితంగా ఇవ్వాలని ఫరూక్ అహ్మద్ అడిగాడు. అందుకు తౌఫిక్ నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్యలో తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. పెర్ఫ్యూమ్ అమ్మే వ్యక్తి టాపిక్ ఆర్గనైజర్ అయిన మీర్ హసీబుద్దీన్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో బొమ్మల షాపు నిర్వహకులను పిలిచి హసీబుద్దీన్ మందలించేందుకు ప్రయత్నించాడు. దీంతో మరోసారి వీరి మధ్య గొడవ జరగగా, ఇంతలో ఆర్గనైజర్ హసబుద్దీన్ తన వద్ద ఉన్న పిస్టల్ తీసుకుని గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ హఠాత్ పరిణామంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదంతో ప్రతిఒక్కరం
# ముందుకు సాగుదాం

### అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోంది

- అభివృద్ధిని మరిచిన బీజేపీ ప్రభుత్వం
- రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది
- కంది మౌనా శ్రీనివాస రెడ్డి



**మహా, ఆదిలాబాద్ :** కేంద్రంలోని బీజేపీ సర్కార్ మతపరమైన రాజకీయాలతో నియంతృత్వ పోకడలతో దేశాన్ని భ్రష్టు పట్టిస్తోందని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డ్ చైర్మన్, జైబాపు జైభీం జై సంవిధాన్ ఇంచార్జి జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం నిర్వహించిన జైబాపు జైభీం జైసంవిధాన్ జిల్లా సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం కోసం ఆవిర్భవించిన పార్టీ అయితే బీజేపీ కేవలం మత పరమైన పార్టీ అన్నారు. అభివృద్ధిని మరిచి మతాన్ని అడ్డం పెట్టుకుని ఓట్లు అడగడమే నైజంగా దేశాన్ని పాలిస్తున్న పార్టీ అని విమర్శించారు.భారత రత్న బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని దాన్ని అడ్డుకుని తీరాలన్నారు. బీజేపీ కబంధహస్తాల కింద దేశం నలిగి పోకుండ కాపాడటంకోసం రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా రాహుల్ గాంధీ చేపట్టిన జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదంతో ప్రతిఒక్కరం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. భారతీయ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర గాంధీ కుటుంబానిది అన్నారు.సమసమాజ నిర్మాణం కోసం రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు నాలుగువేల కిలోమీటర్ల యాత్ర చేపట్టారని గుర్తు చేసారు.బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అలాంటి పార్టీ బలోపేతం కోసం ప్రతీ నాయకుడు కార్యకర్త పని చేయలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుపరిపాలన సాగుతోందన్నారు. రాజ్యంగ పరిరక్షణ నినాదంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.అభివృద్ధి అనేదే కాంగ్రెస్ పార్టీ నినాదమని బడగు బలహీన వర్గాల అభ్యున్నతికి , ప్రజా సంక్షేమం కోసం పని చేసే పార్టీని మరింత పటిష్ఠం చేసే దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు.మనదేశ ఉజ్వల భవిష్యత్తుకోసమే జైబాపు జై భీం జైసంవిధాన్ నినాదమన్నారు.నాయకులు కార్యకర్తలు గ్రామగ్రామాన ప్రజల్లోకి ఈ నినాదాన్ని తీసుకెళ్లాలన్నారు. అనంతరం అందరి చేత జైబాపు జై భీం జైసంవిధాన్ ప్రతిజ్ఞ ప్రతులను ఆవిష్కరించి ప్రతిఒక్కరికి అందించి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.అంతకు ముందు ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని అన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే విధంగా చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు. ఎన్నోభాషలు ఎన్నో మతాలు కులాలున్న దేశం మన దేశం అన్నారు. కులమత బేధాల్లేని పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అందరం కలసి పార్టీ గొప్పతనాన్ని ప్రజలకు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న వక్తలు జైబాపు జై భీం జై సంవిధాన్ కార్యక్రమ ఆవశక్యతను వివరంచారు. కార్యక్రమ చివరిలో కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి అతిథులను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దుర్గం భాస్కర్ ,ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్ , ఆత్రం సుగుణ ,బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్, నాయకులు దిగంబర్ రావు పాటిల్, గోక గణేష్ రెడ్డి ,గుడిపల్లి నగేష్ , మునిగెల నర్సింగ్, అల్లూరి అశోక్ రెడ్డి, ఫైజుల్లాఖాన్ ,కొండ గంగాధర్ , లోక ప్రవీణ్ రెడ్డి ,పరమేశ్వర్ ,భూపెల్లి శ్రీధర్ ,ఆనంద్ రావు, మాజీ కౌన్సిలర్లు , కాంగ్రెస్ మహిళా విభాగం నాయకురాళ్లు ,యంపీటీసీలు , సర్పంచ్ లు నియోజక వర్గ నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



